సాక్షి
ప్రకాశం
గురువారం | 4 | మే | 2023



క్రీడల్లో నైపుణ్యతకు శిక్షణ దోహదం

క్రీడల్లో నైపుణ్యం సాధించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు.

- 8లో..



ప్రభుత్వ భవనాలు వేగంగా నిర్మించాలి

ప్రభుత్వ భవనాలు వేగంగా నిర్మించాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
33 /26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా పాలిటెక్నిక్ కాలేజీ వార్షికోత్సవం



మాట్లాడుతున్న నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: స్థానిక హౌసింగ్ బోర్డులోని డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ వార్షికోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఇంజినీరింగ్‌తోపాటు పాలిటెక్నిక్ విద్యకు మంచి ప్రాముఖ్యత ఉందన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికీకరణ చెందేలా చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా నైపుణ్యాల అవసరం ఉంటుందని, పాలిటెక్నిక్ ద్వారా కూడా ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయన్నారు. స్థానిక కార్పొరేటర్ ఈదర సురేష్‌బాబు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కాలేజీని అద్భుతంగా తీర్చిదిద్దారని, ఈ నేపథ్యంలో ప్రవేశాలు గణనీయంగా పెరిగేందుకు, నాణ్యతతో కూడిన బోధన అందించి ప్రతి విద్యార్థి ఉపాధి అవకాశాలను కైవసం చేసుకునేలా కృషిచేయాలన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ పీవీఎల్ఎన్ శివప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కాలేజీలో నిర్వహించిన జాబ్‌మేళాతోపాటు పాలిసెట్ రాసే విద్యార్థులకు ఉచిత శిక్షణ కూడా అందిస్తున్నామన్నారు. అంతే కాకుండా కాలేజీలో ఉన్న కోర్సుల గురించి వివరించి విద్యార్థుల్లో అవగాహన పెంచి పాలిటెక్నిక్‌లో చేరేందుకు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మాస్టర్స్ కన స్ట్రక్షన్స్ ఎండీ ఎన్.సుబ్బారావు, ఆత్మకూరు పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట అయిన పొగాకు సాగు చేసిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. రబీ సీజన్‌లో తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు ఊరటనిచ్చేలా అదనంగా పండించిన పొగాకుపై పెనాల్టీలు రద్దు చేయాలని సీఎం జగన్ కేంద్ర వాణిజ్యశాఖ మంత్రికి లేఖ రాశారు. మంత్రితో స్వయంగా మాట్లాడారు. ఆ పెనాల్టీలు రద్దయితే రైతులు నష్టాల నుంచి బయటపడతారు. సీఎం చొరవపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రకాశం, నెల్లూరు, గుంటూరు ఉమ్మడి జిల్లాల్లో పొగాకు వేలం కేంద్రాలు:	11
మొత్తం పొగాకు బ్యారన్లు: 24,353	పొగాకు రైతులు: 30,240 మంది
బోర్డు పంట లక్ష్యం: 87.61 మిలియన్ కేజీలు	ఉత్పత్తి అయింది: 107 మిలియన్ కేజీలు
అదనంగా పండింది: 19.39 మిలియన్ కేజీలు	

పొగాకు రైతుకు అండ

- రైతులను ఆదుకునేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ
- అదనపు పొగాకుకు పెనాల్టీలు రద్దు చేయాలని కేంద్రానికి లేఖ
- పెనాల్టీలు రద్దు చేస్తే ఒక్కో రైతుకు రూ.50 నుంచి రూ.70 వేల వరకు ప్రయోజనం
- మార్క్‌ఫెడ్ ద్వారా గతంలో పొగాకు రైతులను ఆదుకున్న సీఎం వైఎస్ జగన్
- మార్క్‌ఫెడ్ వేలంలో పాల్గొన్నప్పటి నుంచి వ్యాపారుల్లో పెరిగిన పోటీ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పొగాకు రైతుకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలుస్తోంది. కష్టకాలం వచ్చినప్పుడల్లా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెన్నంటి ఉంటున్నారు. ధరలు పడిపోయినప్పుడు గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా పొగాకు బహిరంగ వేలంలోకి రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు రైతుకు భరోసా ఇచ్చారు. రూ.220 కోట్ల నిధులు కేటాయించి 2020–21 ఏడాదిలో పండించిన పొగాకు పంటను కొనుగోలు చేయించి నేరుగా రైతులను ఆదుకున్నారు. లో గ్రేడ్ పొగాకును కూడా ఎక్కువ ధరకు కొనుగోలు చేశారు. అప్పటి నుంచి వేలంలో పొగాకు వ్యాపారులు పోటీ పడి కొంటున్నారు. దీంతో రైతుకు మంచి ధర వస్తోంది. అయితే 2022–23 పంట కాలంలో మాండూస్ తుఫాన్ పొగాకు రైతును నష్టపరిచింది. అందువల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు మరో అడుగు ముందుకేశారు. మాండూస్ తుఫాన్‌కు దాదాపు రాష్ట్రంలోని ఏడెనిమిది జిల్లాల్లో పొగాకు పంట నష్టపోయిన తీరును గుర్తించిన సీఎం వైఎస్ జగన్ రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని భావించారు. దీంతో పొగాకు బోర్డు విధించే పెనాల్టీలను రద్దు చేయాలంటూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. బోర్డు నిర్దేశించిన లక్ష్యానికి మించి పండించిన అదనపు పొగాకుపై విధించే పెనాల్టీలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

ఒక్కో రైతుపై రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పెనాల్టీలు:

పొగాకు అదనపు పంటపై పొగాకు బోర్డు ఒక్కో రైతుకు ప్రతి సీజన్‌లో రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పెనాల్టీలు విధిస్తూ వస్తోంది. రైతు పండించిన అదనపు పొగాకు అమ్మకాలపై ప్రతి రూ.100 లకు రూ.5 చొప్పున అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు. ప్రకాశం, నెల్లూరు, గుంటూరు ఉమ్మడి జిల్లాల్లో కలిపి 11 పొగాకు వేలం కేంద్రాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో దక్షిణ ప్రాంత నల్లరేగడి నేలలు (ఎస్‌బీఎస్), దక్షిణ ప్రాంత తేలికపాటి నేలల్లో (ఎస్ఎల్ఎస్) కలుపుకొని మొత్తం 24,353 పొగాకు బ్యారన్లు ఉన్నాయి. వాటి పరిధిలో 30,240 మంది రైతులు పొగాకు పండిస్తున్నారు. పొగాకు బోర్డు నిర్దేశించిన ప్రకారం 58,300 హెక్టార్లలో పొగాకు సాగు చేయాల్సి ఉండగా, 63,482 హెక్టార్లలో సాగు చేశారు. 5182 హెక్టార్లలో పొగాకును అదనంగా సాగు చేశారు.

మాండూస్ తుఫాన్ వల్ల రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అదనపు ఖర్చు:

రబీ సీజన్‌లో వచ్చిన మాండూస్ తుఫాన్ వల్ల పొగాకు రైతుకు తీవ్ర నష్టం సంభవించింది. రైతులు ముందు వేసిన పొగాకు పంట తీవ్రంగా దెబ్బతింది. వర్షాలకు ఉరకెత్తటంతో పొగాకు పంటను పూర్తిగా పీకేయాల్సి వచ్చింది. పంటను రెండో సారి వేశారు. దీంతో ఒక్కో రైతుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అదనపు భారం రైతులపై పడింది. రెండుసార్లు వేయటం వల్ల నిర్దేశించిన పంట లక్ష్యంకంటే అదనంగా 5,182 హెక్టార్లలో పంట సాగు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో దిగుబడి కూడా అధికంగా వచ్చింది. పొగాకు బోర్డు 87.61 మిలియన్ కేజీల పంట దిగుబడి లక్ష్యంగా ఇవ్వగా 107 మిలియన్ కిలోల పొగాకు పంట దిగుబడి వచ్చింది. అంటే 19.39 మిలియన్ కిలోల పొగాకు అదనంగా పండింది. అందుకోసం అదనపు పొగాకు పంటపై పెనాల్టీలు లేకుండా చేయాలని సీఎం వైఎస్ జగన్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. రైతులు మాండూస్ తుఫాన్ వల్ల కలిగిన నష్టాన్ని కనీసం కొంతైనా పూడ్చుకున్నట్లు అవుతుందని ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు.

పెనాల్టీలు రద్దు చేస్తే రైతులు ఒడ్డున పడతారు



మాండూస్ తుఫాన్ వల్ల పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. పొగాకు అదనపు పంటపై బోర్డు పెనాల్టీలు రద్దు చేస్తే రైతులు ఒడ్డున పడతారు. తుఫాన్ వల్ల వేసిన పంటను పీకేసి మళ్లీ వేయాల్సి రావడంతో ఒక్కో రైతు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టపోయాడు. సీఎం వైఎస్ జగన్ రైతులను ఆదుకోవాలనే రైతు భరోసా కేంద్రాలు గ్రామాల్లోనే ఏర్పాటు చేశారు.

– బందారు రామాంజనేయులు, పొగాకు రైతు, చదలవాడ

రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్



రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్. రైతుకు ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించే నైజం ఆయనది. మాండూస్ తుఫాన్‌కు పొగాకు రైతులు నష్టపోయిన తీరును చెప్పగానే వెంటనే కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. లేఖ రాయటంతో పాటు ప్రత్యేకంగా ఫోన్‌లో మాట్లాడి మమ్మల్ని పర్యవేక్షించమని ఢిల్లీకి పంపారు. దాంతో ఢిల్లీలో కేంద్ర వాణిజ్య శాఖ కార్యాలయంలో పెనాల్టీలు రద్దు చేసేలా కేంద్ర మంత్రితో పాటు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం.

– ఎంవీఎస్.నాగిరెడ్డి, రాష్ట్ర అగ్రిమిషన్ వైస్ చైర్మన్

వాణిజ్య శాఖాధికారులతో సంప్రదిస్తున్నారు



సీఎం వైఎస్ జగన్ పొగాకు రైతులను ఆదుకునేందుకు పెనాల్టీలు రద్దు చేయాలని కేంద్రానికి లేఖ రాశారు. పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు కూడా కేంద్ర వాణిజ్య శాఖ కార్యాలయ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. గతంలో రైతులకు పొగాకుకు సరైన ధర లేనప్పుడు మార్క్‌ఫెడ్‌ను బహిరంగ వేలంలోకి దించి ఆదుకున్నారు. దాంతో వ్యాపారుల్లో పొగాకు కొనుగోలు విషయంలో పోటీ పెరిగింది. దీంతో ప్రస్తుత వేలంలో మంచి ధరలు వస్తున్నాయి.

– మారెడ్డి సుబ్బారెడ్డి, పొగాకు బోర్డు సభ్యులు

ఊరించే మామిడి వచ్చేసింది..

- మార్కెట్‌లోకి ఉలవపాడు మామిడి
- ఎగుమతులు ప్రారంభం
- దుకాణాల ద్వారా అమ్మకాలు
- కవర్లు కట్టిన కాయలకు డిమాండ్



పక్వానికి వచ్చిన ఉలవపాడు మామిడి



కాయలను ప్యాకింగ్ చేస్తున్న కూలీలు

ఉలవపాడు: మార్కెట్ లోకి ఉలవపాడు మామిడి పండ్లు వచ్చేశాయి. ప్రతి వేసవిలోనూ నోరూరించే ఉలవపాడు మామిడి పండ్లను మార్కెట్‌లో అమ్మకాలు ప్రారంభించారు. ఇటీవల బయట ప్రాంతాల నుంచి కాయలు తీసుకొచ్చి ఉలవపాడులో అమ్మకాలు సాగించారు. కానీ ఇప్పుడు ఉలవపాడు ప్రాంతం కాయలు పక్వానికి రావడంతో స్థానిక మామిడి కాయల వ్యాపారం ప్రారంభమైంది. ఉలవపాడు మామిడికి అంతర్జాతీయ గుర్తింపు ఉంది. ఇక్కడ నుంచి విదేశాలకు కూడా ఎగుమతులు జరిగేవి. ఉలవపాడు ప్రాంతంలో దాదాపు 10 వేల ఎకరాల్లో మామిడి సాగవుతుంది. మే నెల ప్రారంభమైందంటే ఇక్కడి తోటల్లోని కాయలు మామిడి ప్రియులకు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం జాతీయ రహదారిపై ఉన్న దుకాణాల ద్వారా, లారీలు, ట్రక్కుల్లో వివిధ ప్రాంతాలకు ఎగుమతులు ప్రారంభమయ్యాయి. వ్యాపారులు సైతం ఉలవపాడుకు వచ్చి మామిడి కాయలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

అన్ని రకాలు అందుబాటులోకి..

ప్రస్తుతం ఉలవపాడులో పండించే అన్ని రకాల కాయలు మామిడి ప్రియులకు అందుబాటులోకి వచ్చాయి. ప్రధానంగా బంగినపల్లె, పెద్దరసాలు, చిన్నరసాలు, సువర్ణరేఖ, బెంగళూరు, కొబ్బరిమామిడి, నీలం రకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం తోటల్లో అన్ని రకాల కాయలు కోతలు కోస్తున్నారు. బంగినపల్లె కాయలు ఎగుమతులకు, బెంగళూరు రకం జ్యూస్ ఫ్యాక్టరీలకు ఎగుమతి చేస్తున్నారు.

కాస్త తగ్గిన రేట్లు...

నాలుగు రోజులుగా మామిడి ఎగుమతుల రేట్లు తగ్గాయి. ప్రస్తుతం బంగినపల్లె టన్ను రూ.40 వేలు, బెంగళూరు రకం టన్ను రూ.15 వేలుగా ఎగుమతులు జరుగుతున్నాయి. స్థానిక మార్కెట్, హైవే దుకాణాల్లో మాత్రం బంగినపల్లె కేజీ రూ.65 నుంచి రూ.100 వరకు నాణ్యతను బట్టి అమ్ముతున్నారు. కొబ్బరి మామిడి ఒక్కో కాయ రూ.70 నుంచి రూ.100 వరకు పలుకుతుంది. రసాలు కేజీ రూ.60 నుంచి రూ.90 వరకు నాణ్యతను బట్టి అమ్మకాలు సాగుతున్నాయి.

కవర్లు కట్టిన కాయలకు డిమాండ్:

పండు ఈగ సోకకుండా కవర్లు కట్టిన కాయలకు మంచి డిమాండ్ ఉంది. కవర్లు కట్టిన కాయలు నాణ్యతగా ఉన్నాయి. కాయల మీద మచ్చలు లేకుండా ఉండడంతో వాటికి గిరాకీ పెరిగింది. ప్రధానంగా హైవేపై దుకాణ యజమానులు ఈ కాయల అమ్మకాలకు మక్కువ చూపుతున్నారు. కాయలు నాణ్యతగా ఉండడంతో కేజీ రూ.100 పైనే అమ్ముతున్నారు.

సీజన్‌లో భారీగా వ్యాపారం:

ఉలవపాడు పరిధిలో దాదాపు 10 వేల ఎకరాల పైన మామిడి సాగవుతుంది. కందుకూరు ఉద్యాన శాఖ పరిధిలో 5 వేల ఎకరాల్లో మామిడిసాగు ఉంటుంది. ఎకరాకు 2 నుంచి 4 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను 25 వేల నుంచి 45 వేల వరకు పలుకుతుంది. దాదాపు రూ.95 కోట్ల పైన వ్యాపారం జరుగుతుంది.

ప్రస్తుతం ఇక్కడి కాయల అమ్మకాలు:

ఇటీవల అనంతపురం, హైదరాబాద్ నుంచి కాయలు తీసుకొచ్చి అమ్మకాలు చేసిన పరిస్థితుల్లో మామిడి ప్రియులు ఆందోళనలో పడిపోయారు. ఇక్కడకు వచ్చి ప్రస్తుతం ఎక్కడి కాయలు అమ్ముతున్నారో అనే అయోమయంలో పడిపోయారు. వారం రోజులుగా ఉలవపాడు కాయలు పక్వానికి వచ్చాయి. ప్రస్తుతం ఇక్కడి కాయలను వారం నుంచి దుకాణాల్లో అమ్ముతున్నారు. మామిడి కొనుగోలు దారులు ఇప్పటి నుంచి రెండు నెలల వరకు ఉలవపాడు కాయలే కొనుగోలు చేయవచ్చు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ప్రజల సమస్యలు తెలుసుకొని తక్షణమే పరిష్కరించేందుకు సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల ఇంటిముంగిటకు అన్ని శాఖలకు చెందిన అధికారులను పంపుతున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక సచివాలయం–2 పరిధిలోని ఇందిరా నగర్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు ఏమేరకు లబ్ధిపొందారు, ఇంకా ఏమైనా అవసరం ఉందా అని ఆయన అడిగి తెలుసుకున్నారు. సీఎం జగనన్న అన్ని వర్గాల పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారని, ఈ మేరకు నవరత్నాల పథకాలను క్రమం తప్పకుండా అమలు పరుస్తున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కరోనా కష్టకాలంలో కూడా పాలనను సజావుగా ముందుకు తీసుకెళ్లగలిగారని అన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ భరోసా, నేతన్న నేస్తం, కాపు నేస్తం, ఆసరా, చేయూత, విద్యాకానుక, వసతి దీవెన, విద్యా దీవెన లాంటి పథకాలను ఆపకుండా పరిపాలన చేసిన ఘనత జగన్‌మోహనరెడ్డిదే అని చెప్పారు. గతంలో టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క వాగ్దానం నెరవేర్చలేక పోయారని విమర్శించారు. విప్లవాత్మకమైన నిర్ణయాలతో వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత సీఎందేనని పేర్కొన్నారు. ఎన్నికల ముందు జగనన్న చేసిన సుదూర పాదయాత్రలో పొదుపు మహిళలు తాము చేసిన అప్పులు కట్టలేక నలిగిపోతున్న పరిస్థితిని కళ్లారా చూశారన్నారు. మహిళల అప్పులను విడతల వారీగా రద్దుచేస్తానని ఆనాడు మాట ఇచ్చారన్నారు. ఆ మాట ప్రకారమే నవరత్నాల్లో చేర్చి విడతల వారీగా నగదును నేరుగా మహిళల అకౌంట్‌లలో జమ చేశారని చెప్పారు. వైఎస్సార్ అధికారంలో ఉన్న సమయంలో పొదుపు మహిళలకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చారని, ఆయన తనయుడు మరో అడుగు ముందుకేసి సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తున్నారని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్ పనులను వేగవంతంచేసి మొదటి టన్నెల్ పూర్తి చేశారని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలుపై సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసిన సీఎంని గతంలో తాము చూడలేదని, చిత్తశుద్ధితో తమ ముఖ్యమంత్రి క్యాలెండర్ విడుదల చేశారని అన్నారు. నాలుగేళ్లుగా సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయని, లబ్ధిదారుల అకౌంట్‌లలో నేరుగా నగదు జమ చేయడం ఇష్టంలేని టీడీపీ నాయకులు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారని విమర్శలకు దిగారని అన్నారు. ఇందిరా నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాలని, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని, పేదల గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, మండల సభ్యుడు విజయకుమార్, మండల ఉపాధ్యక్షుడు ఎం.ఆదిశేషు, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, సర్పంచ్ అరుణాబాయి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, తహసీల్దార్ కె.దాసు, ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు, హౌసింగ్ డీఈ సురేష్‌బాబు, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఎంఈవో పి.ఆంజనేయులు, ఏఈలు పి.శ్రీనివాసులు, మహంకాళయ్య, శ్రీకాంత్, అంజిరెడ్డి, ఈవో ఈదుల రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి కృషి

- జేసీ డాక్టర్ కే శ్రీనివాసులు
- పాకల, కొత్తపట్నం పల్లెపాలెం బీచ్, గుండ్లకమ్మ ప్రాజెక్టుల పరిశీలన

సింగరాయకొండ/కొత్తపట్నం/మద్దిపాడు: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని జాయింట్ కలెక్టర్ డాక్టర్ కే శ్రీనివాసులు అన్నారు. జిల్లాలో పర్యాటకానికి అనువుగా ఉండే ప్రాంతాలైన పాకల, కొత్తపట్నం పల్లెపాలెం బీచ్‌లు, గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద పర్యాటక అభివృద్ధికి కేటాయించిన స్థలాలను బుధవారం ఆయన పరిశీలించారు. పాకల బీచ్‌లో సముద్ర తీరం వద్ద సర్వే నంబరు 804, 832 లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆయన పరిశీలించారు. జిల్లా టూరిజం శాఖ అధికారి బెన్‌హర్ మాట్లాడుతూ టూరిజం అభివృద్ధికి గతంలో 5 ఎకరాలు కోరామని, ఆ స్థలాన్ని తమ శాఖ పేరు మీద బదలాయించటానికి జేసీ శ్రీనివాసులు పరిశీలించారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్ మా స్థలంలో కాకుండా వేరే స్థలంలో రెస్టారెంట్ కట్టడంతో ఆ ప్రాజెక్టు నిలిచిందన్నారు. ఆయన వెంట ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహశీల్దార్ సీహెచ్ ఉష, వీఆర్‌ఓ సీతారామయ్య, సర్వేయర్లు సాయి, వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్లపోతు గోవర్ధన్ ఉన్నారు. కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 2066, 1694లో సుమారు 4 ఎకరాల భూమిని 2010లో టూరిజం శాఖకు తాత్కాలికంగా కేటాయించారు. ఇప్పుడు దానిని అధికారికంగా ప్రొసీడింగ్ తయారు చేసి శాశ్వతంగా టూరిజం డిపార్ట్‌మెంట్‌కి కేటాయించేందుకు ఆ స్థలాన్ని జేసీ, జిల్లా టూరిజం శాఖ అధికారి బెనహర్ పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ బీవీ రమణారావు, వీఆర్వో వినోద్ కుమార్ ఉన్నారు. మద్దిపాడు మండలం మల్లవరంలో నిర్మించిన కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ జలాశయం వద్ద పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఉన్న 13 ఎకరాల స్థలాన్ని పర్యాటక శాఖకు కేటాయిస్తూ లేఖ ఇచ్చారు. ఆమేరకు ఆ స్థలాన్ని జేసీ శ్రీనివాసులతో పాటు, జిల్లా పర్యాటక శాఖాధికారి బెనహర్ పరిశీలించారు. పర్యాటక శాఖకు స్థలాన్ని అప్పగించేందుకు ఫైలు సీసీఎల్ఏకు పంపాల్సిన నేపథ్యంలో స్థల పరిశీలన చేశారు. వారి వెంట ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు, మండల డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు ఉన్నారు.





పాకల బీచ్‌లో, కె.పల్లెపాలెం బీచ్‌లో టూరిజం స్థలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు మరియబాబు

తాడేపల్లిరూరల్ : జాతీయ రహదారిపై కుంచనపల్లి బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం.. దొనకొండ మండలం పెదపూడి గ్రామానికి చెందిన గన్నేపల్లి మరియబాబు (36) విజయవాడ నుంచి గుంటూరు వైపు జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో యువకుడు తలకు గాయమై మృతి చెందాడు. ద్విచక్రవాహనం, ఆధార్ కార్డు ఆధారంగా పెదపూడిలోని మరియబాబు బంధువులకు సమాచారం అందజేశామని, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మంగళగిరి ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితులకు జైలు

కంభం: దొంగతనం కేసులో నిందితులకు మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ గిద్దలూరు కోర్టు న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని ఎస్సై నాగమల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. 2020వ సంవత్సరంలో మండ్లా గురవమ్మ, బల్లారపు సుబ్బయ్య ఇళ్లల్లో చోరీ జరగగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో నిందితులైన మల్లెపోగు దావీదు, షేక్షావలిపై నేరారోపణ రుజువు కావడంతో మూడు నెలల జైలు శిక్ష విధించారని తెలిపారు.

'రాజధానిలో ఒకే ఒక్కడు' చిత్రం టైటిల్ ప్రారంభం



మాట్లాడుతున్న దర్శకుడు సుభాష్

ఒంగోలు: 'రాజధానిలో ఒకే ఒక్కడు' చిత్రం టైటిల్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం స్థానిక సుజాతనగర్‌లోని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ప్రారంభమైంది. దర్శకుడు సుభాష్‌బాబు మాట్లాడుతూ నూతన, పాత నటీనటులతో త్వరలో ఒంగోలు, పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో నిర్మాత వీవీ రెడ్డి , ఆర్‌ఆర్‌ఆర్ రెసిడెన్సీ విజయ్, కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాల్‌రెడ్డితోపాటు వీరు యాదవ్, ఎ.చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రండి.. చదవండి.. సాధించండి



- ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- జిల్లాలో బాలికలకు 4, బాలురకు 4 సెంటర్లు ఏర్పాటు
- ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులయ్యేలా శిక్షణ
- కలెక్టర్ దినేష్‌కుమార్ పర్యవేక్షణలో ప్రారంభం

ఒంగోలు:

'ఫెయిలయ్యారని జాలిచూపడం కాదు.. వారు ఉత్తీర్ణత సాధించేందుకు, భవిష్యత్తును బంగారుమయం చేసుకునేందుకు మరో అవకాశం ఇద్దాం' అని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఇటీవల ఒంగోలు నగరంలోని ఆంధ్ర కేసరి కాలేజీలో ఇంటర్మీడియెట్ అధ్యాపకులతో కలెక్టర్ సమీక్షించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ప్రత్యేక కార్యాచరణ అమలుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం తక్కువమంది ఫెయిలైన విద్యార్థులు ఉన్నందువల్ల వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఉద్యోగ బాధ్యతలు అనే విషయాన్ని పక్కనబెట్టి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని హితబోధ చేశారు. ఇందుకు స్పందించి లెక్చరర్లు కూడా ముందుకు రావడంతో జిల్లాలో 8 ప్రత్యేక కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వాటిలో నాలుగు కోచింగ్ సెంటర్లు బాలురకు, మరో నాలుగు కోచింగ్ సెంటర్లు బాలికలకు కేటాయించారు.

బాలుర కోచింగ్ సెంటర్లు

ఏపీఆర్‌జేసీ-వెలుగొండ, ఏపీఆర్‌జేసీ-అర్ధవీడు, ఏపీఆర్‌జేసీ-దర్శి, సరస్వతి కాలేజీ-పెళ్లూరు

బాలికల కోచింగ్ సెంటర్లు

ఏపీఆర్‌ఈఎస్(బాలికలు)-చీమకుర్తి, ఏపీఆర్‌ఈఎస్(బాలికలు)-సింగరాయకొండ, ఏపీఆర్‌ఈఎస్(బాలికలు)-కంభం, ఏపీఆర్‌ఈఎస్(బాలికలు)-మార్కాపురం వద్ద రాయవరం.

21వ తేదీ వరకు శిక్షణ

ఫెయిలైన విద్యార్థులు ఏయే అంశాల్లో వెనుకబడుతున్నారు, వారిలో లోపాలు ఏమిటి, వాటిని సరిచేయడంతోపాటు అవసరమైన మెళకువలు సూచించడంతోపాటు నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ ఇప్పించడం ఈ కోచింగ్ సెంటర్ల ప్రత్యేకత. ప్రతి సెంటర్‌కు నలుగురు ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షించాలని ఆదేశించారు. బాలికల రెసిడెన్షియల్ సెంటర్లకు కేర్ టేకర్, అధికారులు అందరు మహిళలనే నియమించారు. లెక్చరర్ల బోధనతోపాటు మెంటార్లతో అనుమానాల నివృత్తి, రోజూ మూల్యాంకనం చేస్తూ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలకు ఉపక్రమించారు. శిక్షణ కేంద్రాల్లో ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుందని, ఈ అవకాశాన్ని జిల్లాలో ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రులు కూడా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడల్లో నైపుణ్యతకు శిక్షణ దోహదం



వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ మలికాగర్గ్



హాజరైన పోలీసు చిల్డ్రన్ క్రీడాకారులు

- ఎస్పీ మలికాగర్గ్
- పరేడ్ గ్రౌండ్‌లో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం
- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచన

ఒంగోలు: క్రీడల్లో నైపుణ్యత పెంపొందించుకునేందుకు, ప్రావీణ్యతలను పరీక్షించుకునేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని ఎస్పీ మలికా గర్గ్ పేర్కొన్నారు. మానసికంగా ఉత్సాహం, ఉల్లాసాన్ని నింపడంతోపాటు శారీరక దారుఢ్యాన్నిచ్చే క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోజూ ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు సమ్మర్ క్యాంప్‌లో ఫుట్‌బాల్ , టగ్ ఆఫ్ వార్, షటిల్ బ్యాడ్మింటన్, రన్నింగ్, ఇన్‌డోర్/అవుట్ డోర్ గేమ్స్‌తోపాటు పెయింటింగ్, డ్రాయింగ్ తదితర అంశాల్లో నిపుణులతో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. క్యాంప్‌లో పాల్గొనేందుకు విద్యార్థులందరికీ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులు తమకు మక్కువ ఉన్న క్రీడల్లో ప్రావీణ్యత సాధించేందుకు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్లో దాగి ఉన్న క్రీడా కౌశలాన్ని వెలికితీసేందుకు కృషిచేయాలని సూచించారు. శిక్షకులుగా ఒంగోలు ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర, పోలీసు చిల్డ్రన్స్ కమిటీ అధ్యక్షులు, వివిధ రంగాల్లో నిష్ణాతులైన బ్రేవ్ నేషనల్ క్రీడాకారులు వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అంకిత సురాన, అదనపు ఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎస్‌వీ శ్రీధర్‌రావు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోండి



డిగ్రీ పట్టాలు ప్రదానం చేస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

- ఇంజినీరింగ్ విద్యార్థులకు మంత్రి సురేష్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి సూచన

మార్కాపురం: నూతన టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సూచించారు. స్థానిక జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రాత్రి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ.. సమాజంలో సమస్యల పరిష్కారానికి టెక్నాలజీ వినియోగించే దిశగా ఇంజినీరింగ్ విద్యార్థులు ఆలోచించాలన్నారు. లక్ష్యం లేకుండా చదివితే ఉపయోగం లేదని, కష్టపడితే మంచి ఉద్యోగం పొందవచ్చన్నారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యకు జార్జి విద్యా సంస్థలు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్నాయని, కష్టపడి చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ బి.జయరామిరెడ్డి, కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ తదితరులు మాట్లాడారు. అనంతరం వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీస్‌లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు, డిగ్రీ పూర్తయిన వారికి సర్టిఫికెట్లు, ఆఫర్ లెటర్స్ అందించారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

పల్లెల్లోనూ సైబర్ నేరాలు

- బ్యాంక్ సేవా కేంద్రాలే టార్గెట్

కారంచేడు: ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన సైబర్ క్రైం నేడు పల్లెలకు కూడా విస్తరిస్తున్నాయి. ఇలా డబ్బు పోగొట్టుకుంటున్న బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారిని సైతం ఈ సైబర్ నేరగాళ్ళు బురిడీ కొట్టిస్తున్నారు. మండల కేంద్రమైన కారంచేడు స్టేట్‌బ్యాంక్ సెంటర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా మీసేవా కేంద్రం నిర్వహిస్తున్న యజమాని కొల్లా పవన్‌కుమార్ ఈ సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో చిక్కుకున్నాడు. ఈ సంఘటన గత నెల 27వ తేదీన జరగగా ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 27వ తేదీన రైతులా ఉన్న ఒక వ్యక్తి వచ్చి తనది పర్చూరు మండలం నూతలపాడని పరిచయం చేసుకున్నాడు. తన వ్యవసాయ భూమిలో కూలీలు పనిచేస్తున్నారని, వారికి ఇవ్వడానికి డబ్బు అవసరమని, నీకు ఫోన్‌పే ద్వారా మనీ పంపిస్తాను ఆ సొమ్మును నాకు ఇవ్వాలని కోరాడు. దీంతో బ్యాంక్ వినియోగదారుల సేవా కేంద్రం కూడా కలిగి ఉన్న ఆ యజమాని డబ్బు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. 10 నిమిషాల్లో ఆ వ్యక్తి సార్ మీ అకౌంట్‌కు డబ్బు వచ్చింది చూడండి అని చెప్పాడు. దీంతో అకౌంట్ పరిశీలించిన పవన్‌కుమార్ తన అకౌంట్‌కు వచ్చిన ఫోన్ నంబర్, పేరు అడిగి అతను చెప్పిన వాటికి సరిపోవడంతో మొదటగా (9849942345, కె. శ్రీనివాసరెడ్డి) నంబర్ నుంచి రూ. 30 వేలు, రెండో సారి మరలా రూ. 25 వేల నగదు చెల్లించాడు. తరువాత ఇంకొక నంబర్ (9849942345, చాగంటి రాజేష్) నుంచి రూ. 30 వేలు కలిపి మొత్తం రూ. 85 వేలను సదరు వ్యక్తి తీసుకొని వెళ్లాడు. అమౌంట్ ఫోన్‌పే ద్వారా పంపిన ఇద్దరిదీ తెలంగాణ కావడం విశేషం. కాగా ఆ రోజు సాయంత్రం ఒక వ్యక్తి ఫోన్ చేసి నేను ఉదయం మీ నంబర్‌కు ఫోన్‌పే ద్వారా అమౌంట్ పంపాను. తిరిగి నాకు పంపాలని కోరాడు. అదేంటి నాదగ్గరకు వచ్చిన వ్యక్తి నాకు ఫోన్‌పే ద్వారా డబ్బు వేస్తాను, క్యాష్ కావాలని కోరడంతోనే ఆ అకౌంట్‌కు వచ్చిన మనీ ఆధారంగానే తనకు డబ్బు చెల్లించానన్నాడు. అయితే ఇది మోసం అంటూ డబ్బు పంపిన వ్యక్తి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మీసేవ యజమాని అయిన పవన్‌కుమార్‌కు చెందిన అన్ని రంగాల బ్యాంక్ ఖాతాలను బ్లాక్ చేశారు. దీంతో సదరు యజమాని లబోదిబోమంటూ తనకు సంబంధం లేని వ్యవహారంలో తన బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్ కావడంతో సేవలకు అంతరాయం ఏర్పాడి ప్రజలు అవస్థలు పడుతున్నారని, సైబర్‌క్రైం పోలీసులు త్వరగా విచారణ చేసి తనకు న్యాయం చేయాలని వాపోతున్నాడు. ఇదే తరహా నేరం గుంటూరు జిల్లా పెదనందిపాడులోని మీసేవా కేంద్రంలో గత నెల 25వ తేదీన జరిగినట్లు తెలిసిందని, రెండు నేరాలకు పాల్పడిన వ్యక్తి ఒకరై ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నాడు.

ద్వాక్రా సభ్యుల ఆర్థికాభివృద్ధికి లోకోస్ యాప్



లోకోస్ యాప్‌లో డ్వాక్రా గ్రూపు సభ్యుల వివరాలు నమోదు చేస్తున్న సెర్ప్ అధికారులు

సింగరాయకొండ: లోకోస్ యాప్‌లో డ్వాక్రా సంఘాల సభ్యుల వివరాల నమోదుతో ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకావం ఏర్పడుతుందని సెర్ప్ ఫైనాన్స్ రాష్ట్ర అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బైరాగిమాన్యంలో బుధవారం బిస్మిల్లా డ్వాక్రా గ్రూపు లీడర్ ఇంటి వద్ద లోకోస్ యాప్‌లో వివరాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. సెర్ప్ ఫైనాన్స్ అధికారి మాట్లాడుతూ.. డ్వాక్రా గ్రూపుల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు విస్తృతంగా మార్కెటింగ్ సదుపాయం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద లోకోస్ యాప్ రూపొందించిందని పేర్కొన్నారు. ఈ యాప్‌లో సభ్యుల వివరాలు నమోదు చేయడానికి మండలానికి ఇద్దరు చొప్పున వీఓఏలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా బిస్మిల్లా గ్రూపు సభ్యుల వివరాలు నమోదు చేసినట్లు వెల్లడించారు. సెర్ప్ అధికారులు శంకర్, డీపీఎం రాంబాబు, కృపారావు, డీఎంజీ శ్రీను, ఏపీఎం డి.జయరాజ్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు వేగంగా నిర్మించాలి



పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బుధవారం ప్రకాశం భవనంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. డివిజన్లు, మండలాల వారీగా ఆయా నిర్మాణాల పురోగతిపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల ఫిజికల్ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, జూన్ చివరినాటికి ఆరోగ్య శాఖ అధికారులకు అప్పగించాలని స్పష్టం చేశారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల పనులు జూన్ 10వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. ప్రాధాన్య భవనాల నిర్మాణాలు చేపట్టడంలో ఏజెన్సీ పరంగా, స్థానికంగా ఎదురయ్యే సమస్యలను ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో పరిష్కరించడంపై శ్రద్ధ వహించాలన్నారు. అప్పటికీ పరిష్కారం కాకుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. జగనన్న కాలనీలకు స్వాగత ద్వారం పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు



ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు, డీఆర్ఓ శ్రీలత

- జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ యంత్రాంగంలో భాగమైన ఉద్యోగుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్పందన భవనంలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు తెలుసుకునేందుకు కలెక్టర్ ఆలోచన మేరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామన్నారు. పలువురు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు తమ సమస్యలను జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. అర్జీలపై జేసీ స్పందిస్తూ.. విధి నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ఇతర సమస్యలకు 15 రోజుల్లోగా పరిష్కారం చూపుతామన్నారు. పరిష్కారం కాకుంటే అర్జీదారులను పిలిచి అందుకు గల కారణాలను తెలియజేస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేక స్పందన నిర్వహించడంపై ఉన్నతాధికారులకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. డీఆర్ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, నారదముని, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ మాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

- రూ.4 లక్షల ఆస్తి నష్టం

మద్దిపాడు: మండల కేంద్రమైన మద్దిపాడులో ప్రమదావశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధం కావడంతో 4 లక్షల రూపాయల ఆస్తి నస్టం సంభవించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. మద్దిపాడు గ్రామనికి చెందిన బత్తిన రాంబాబు బ్యారన్‌లో బుధవారం తెల్లవారుజామున మంటలు ఎగిసిపడుతుండటంతో స్థానికులు గమనించి ఒంగోలు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. మొద్దు గొట్టంపై బ్యారన్ కర్రలు పడటంతో ప్రమాదం జరిగిందని, మొత్తం 1200 పొగాకు కర్రలు కాలిపోయాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు ఆటోలు ఢీ

- ముగ్గురికి తీవ్ర గాయాలు

దర్శి టౌన్: దర్శి-పొదిలి ఆర్‌అండ్‌బి రోడ్‌లో ముసి ఆంజనేయ స్వామి గుడి సమీపంలో బుధవారం రెండు ఆటోలు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కుంచేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వరికుంట లక్ష్మణ్, అభి సలీం, వెంకటేష్ రాజంపల్లి వైపు వెళ్తూ.. ఎదురుగా వస్తున్న మరో ఆటోను ఢీకొట్టారు. క్షతగాత్రులను 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.



ప్రమాదంలో గాయపడిన యువకులు

ఉరివేసుకుని యువకుడు మృతి

అద్దంకి: స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ మృతిచెందిన సంఘటన మండలంలోని కల్లం స్పిన్నింగ్ మిల్లు సమీపంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిస్సా రాష్ట్రం, భద్రక్ జిల్లా గిరమటి గ్రామానికి చెందిన సుధా మినిమాలిక్ (23)కు నెల రోజుల క్రితం వివాహం అయింది. తండ్రి ప్రోద్బలంతో బతుకు తెరువు కోసం మండలంలోని కుంకుపాడు సమీపంలోని కల్లం స్పిన్నింగ్ మిల్లులో గత నెల నుంచి షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం తండ్రికి తనకు ఇక్కడ పనిచేయడం ఇష్టం లేదని ఫోన్ చేసి చెప్పాడు. అయితే ఇంకా కొన్నాళ్లు అక్కడే పనిచేయాలని తండ్రి చెప్పాడు. దీంతో నాలుగు రోజులు నుంచి మిల్లు పనికి వెళ్లడం లేదు. మంగళవారం రాత్రి ఇంట్లో భోజనం చేసి పడుకున్నాడు. భార్య తెల్లవారి లేచి చూసే సరికి తన భర్త మంచంపై లేడు. ఇంతలో తనకు తెలిసిన వ్యక్తి వచ్చి మీ భర్త రోడ్డు పక్కనున్న వేప చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడని చెప్పాడు. దాంతో అక్కడికి వెళ్లిన భార్య తోటి వారి సాయంతో పోలీసులకు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న ఎస్సై సమందర్ వలి అక్కడకు వెళ్లి విచారించి, మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం భార్యకు అప్పగించారు.

లారీ ఢీకొని వృద్ధుడు దుర్మరణం



కోటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివకుమార్

అద్దంకి: లారీ కింద పడి వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన సంతమాగులూరు మండలంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని ఏల్చూరులో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన తుమ్మూరి కోటేశ్వరరావు (70) టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో హర్యానాకు చెందిన కంటైనర్ లారీ వెనుక చక్రాలు ఎక్కడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వాడు అనే వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఎస్సై శివకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి



మృతి చెందిన ఆదాం షరీఫ్

కురిచేడు: ద్విచక్రవాహనం అదుపు తప్పి చప్టా గోడను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంగాయపాలెం సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ఎం.దేవకుమార్ కథనం మేరకు.. స్థానిక కోట బజారుకు చెందిన షేక్ ఆదాంషరీఫ్(48) తన బైక్‌పై చింతలచెరువు వెళ్తున్నాడు. వెంగాయపాలెం గ్రామం దాటిన తర్వాత వాగుపై నిర్మించిన చప్టా వద్ద బైక్ అదుపు తప్పి గోడను ఢీకొట్టాడు. వాగులో పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనదారుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవకుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.